సాక్షి
పెద్దపల్లి
సోమవారం, 27, జనవరి, 2025


గోదావరిఖని : ఆర్జీ- 2 ఏరియాలో సాంస్కృతిక ప్రదర్శనలు ఇస్తున్న బాలికలు

న్యూస్‌రీల్

భక్తుల కోలాహలం


స్వామివారికి పట్నాలు వేస్తున్న భక్తులు

ఓదెల(పెద్దపల్లి): ఓదెల మల్లికార్జునస్వామి సన్నిధిలో ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోపాటు మహారాష్ట్ర నుంచి భక్తులు భారీసంఖ్యలో తరలివచ్చారు. ఒగ్గు పూజారులతో స్వామివారికి పట్నాలు వేయించారు. బోనాలతో నైవేద్యం సమర్పించారు. ఆలయ ఈవో సదయ్య, జూనియర్ అసిస్టెంట్ కుమారస్వామి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

బల్దియాల్లో ప్రత్యేక పాలన

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌తోపాటు మూడు మున్సిపాలిటీలకు ప్రత్యేకాధికారులను నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటివరకు ఉన్నపాలకవర్గాల పదవీకాలం ఆదివారం(ఈనెల26) ముగిసింది. దీంతో సోమవారం నుంచి ప్రత్యేకాధికారుల పాలన కొనసాగనుంది. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌కు కలెక్టర్ కోయ శ్రీహర్షకు ప్రత్యేకాధికారిగా బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీలకు అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ ప్రత్యేక అధికాధిగా వ్యవహరించనున్నారు.

ప్రజాభిప్రాయ సేకరణకు భద్రత


సభాస్థలి పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష, సీపీ

జ్యోతినగర్(రామగుండం): రామగుండంలోని ఎన్టీపీసీలో తెలంగాణ ప్రాజెక్టు స్టేజ్–2 ప్రజాభిప్రాయ సేకరణకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ కోయ శ్రీహర్ష, రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్, పెద్దపల్లి డీసీపీ చేతన తెలిపారు. ఎన్టీపీసీలోని జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో ఈనెల 28న నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణ సభావేదికను ఆదివారం వారు పరిశీలించారు. సభ సజావుగా సాగేందుకు, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా, ప్రజల కోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. అడిషనల్ డీసీపీ(అడ్మిన్)రాజు, స్పెషల్ బ్రాంచ్, గోదావరిఖని, ట్రాఫిక్ ఏసీపీలు రాఘవేంద్రరావు, రమేశ్, నరసింహులు, సీఐలు ప్రవీణ్ కుమార్, ఇంద్రసేనారెడ్డి, ఎస్సైలు ఉదయ్‌కిరణ్, మానస, సంధ్యారాణి పాల్గొన్నారు.

ఒక భవనం - మూడు జెండాలు


జెండాలు ఎగురవేస్తున్న అతిథులు

జూలపల్లి(పెద్దపల్లి): స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనం ఎదుట ఆదివారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఒకేసారి మూడు జెండాలు ఆవిష్కరించారు. ఈ భవనంలో సహకార సంఘం, శాఖ గ్రంథాలయం, మండల వ్యవసాయ శాఖ కార్యాలయాలు ఉన్నాయి. ఆయా కార్యాలయాల అధికారులు ప్రత్యూష, మౌళి, వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ కొంజెర్ల వెంకటయ్య ఒకేసారి మూడు జెండాలు ఆవిష్కరణ చేశారు.

మొబైల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దు


మాట్లాడుతున్న ఆర్టీవో రంగారావు

సుల్తానాబాద్(పెద్దపల్లి): మొబైల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దని రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్(ఆర్టీవో) రంగారావు సూచించారు. మండల కేంద్రంలో ఆదివారం లారీ, వ్యాన్ యజమానులు, డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై ఆయన అవగాహన కల్పించారు. భద్రతా మాసోత్సవాల సందర్భంగా ట్రాఫిక్ సీఐ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఆర్టీవో మాట్లాడుతూ, లారీలు, వ్యాన్లు, ఇతర భారీ వాహనాలతో ప్రమాదాలు జరిగితే.. నష్టం అధికంగా ఉంటుందని, అందుకే డ్రైవర్లు జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు. అధికలోడ్‌తో వాహనాలు నడపకూడదని తెలిపారు. మద్యం తాగి, అతివేగంగా వాహనం నడిపితే అదుపు చేసే అవకాశం తక్కువగా ఉండి, ప్రమాదాలు జరుగుతాయని అన్నారు. ఎంవీఐ మసూద్, ఏఎంవీఐ మధు, లారీ డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు తిరుపతి, సుంకిశాల తిరుపతిరావు, సీపతిరాజుగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, జాపతి రాజిరెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమం..అభివృద్ధి లక్ష్యం

- అర్హులందరికీ పథకాల ఫలాలు
- కలెక్టర్ కోయ శ్రీహర్ష వెల్లడి
- ఘనంగా గణతంత్ర వేడుకలు


మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష




జ్యోతినగర్ : ఆకట్టుకున్న విద్యార్థుల విన్యాసాలు


జ్యోతినగర్ : స్కౌట్స్ అండ్ గైడ్స్, విద్యార్థుల ప్రదర్శనలు




జెండా ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష, పక్కన డీసీపీ చేతన, ఎమ్మెల్యే విజయ్, ఏసీపీ కృష్ణ, జెండా వందనం చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి హేమంత్‌కుమార్, హాజరైన అతిథులు, ప్రతినిధులు


గోదావరిఖని : కరాటే విద్యార్థుల విన్యాసాలు

పెద్దపల్లిరూరల్: ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యమని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. కలెక్టరేట్‌లోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెద్దపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు చింతకుంట విజయరమణారావు, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌తో కలిసి కలెక్టర్ కోయ శ్రీహర్ష వేడుకలకు హాజరయ్యారు. తొలుత జాతీయ ఆవిష్కరించిన కలెక్టర్.. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రజాసంక్షేమం, జిల్లా అభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు సూచించారు. ప్రస్తుతం రూ.610కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అమృత్ 2.0 కింద రామగుండం నగరంలో రూ.312 కోట్లతో సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మిస్తున్నామన్నారు. రూ.144కోట్లతో సీసీరోడ్లు, డ్రైనేజీ, సెంట్రల్ లైటింగ్, మున్సిపల్ భవన నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. గణతంత్ర వేడుకల సందర్భంగా ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతుభరోసా, కొత్త రేషన్‌కార్డుల జారీ పథకాలు ప్రారంభించామని తెలిపారు. 13,638 మందిని ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు, 12,705 కుటుంబాలను రేషన్‌కార్డు కోసం ప్రాథమికంగా ఎంపిక చేశామని ఆయన వివరించారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తామని, జాబితాలో పేరు లేనివారు ఆందోళన చెంద వద్దని స్పష్టం చేశారు. ఇది నిరంతర ప్రక్రియ అని అన్నారు.

రుణమాఫీ, బోనస్..

రైతులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం రుణమాఫీ, సన్నరకం ధాన్యానికి బోనస్ అందిస్తూ ప్రోత్సహిస్తోందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 58,896 మంది రైతులకు రూ.446.54 కోట్లతో రూ.2 లక్షల రుణమాఫీ, 26,652 మందికి 2.29 లక్షల క్వింటాళ్లకుపైగా సన్నరకం ధాన్యం బోనస్‌గా రూ.85.33 కోట్లు అందించామని వివరించారు. జిల్లాలో 2,866 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ చేశామని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు.

మహిళలు.. మహాలక్ష్ములు

మహాలక్ష్మి పథకం ద్వారా జిల్లాలో ఇప్పటివరకు 2.40కోట్లకుపైగా జీరో టికెట్లతో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని కలెక్టర్ శ్రీహర్ష తెలిపారు. రూ.500లకే గ్యాస్‌సిలిండర్ కింద రూ.11.29 కోట్ల రాయితీ కల్పిస్తూ 3,80,717 సిలిండర్లు సరఫరా చేసినట్లు తెలిపారు. గృహజ్యోతి ద్వారా రూ.54.93 సబ్సిడీని 1,30,273 నివాసాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేశామని ఆయన అన్నారు. 17,750 మందికి ఆరోగ్యశ్రీ ద్వారా రూ.40.50 కోట్ల విలువైన వైద్యసేవలు అందించినట్లు కలెక్టర్ వివరించారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో సేవలు మెరుగు..

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఇటీవల ప్రారంభించిన కంటి శస్త్రచికిత్సల ద్వారా ఇప్పటివరకు 122 మందికి ఆపరేషన్ చేశామని శ్రీహర్ష తెలిపారు. 744 డెంటల్, 603 ఆర్థోపెడిక్ సర్జరీలు చేశారని, పిల్లల కోసం 20 పడకలతో ప్రత్యేక వార్డు అందుబాటులోకి తెచ్చామని అన్నారు. నవజాత శిశువుల కోసం 5 ఫొటోథెరపీ యూనిట్లు, 5 వార్మర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. నార్మల్, టిఫా స్కానింగ్ సేవలు అందుబాటులోకి తెచ్చామని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా 477 స్కూళ్లలో రూ.15.54 కోట్లు వెచ్చించి మౌలిక వసతులు కల్పించినట్లు వివరించారు.

నెరవేరిన ఆర్టీసీ డిపో స్వప్నం..

పెద్దపల్లి బస్టాండ్ సమీపంలోనే ఆర్టీసీ బస్సు డిపో ప్రభుత్వం మంజూరు చేసి ఈప్రాంత ప్రజల చిరకాల స్వప్నం నెరవేర్చిందని శ్రీహర్ష అన్నారు. త్వరలోనే ఎంపీడీవో తదితర కార్యాలయాలు ఖాళీ చేయించి బస్సు డిపో ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు.

రూ.317 కోట్లతో 817 మందికి ఉపాధి..

టీజీ – ఐపాస్ ద్వారా రూ.317.56 కోట్ల పెట్టుబడితో 817 మందికి ఉపాధి అవకాశాలు కల్పించినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం ద్వారా రూ.1.21 కోట్ల సబ్సిడీతో 28 యూనిట్లు ఏర్పాటయ్యాయని అన్నారు. టీ–ఐడియా, టీ- ప్రైడ్ ద్వారా 33 సేవా, తయారీ రంగ పరిశ్రమలకు రూ.36.15 కోట్ల రాయితీ మంజూరు చేశామని శ్రీహర్ష తెలిపారు.

మహిళా సంఘాలకు రూ.116.74కోట్ల రుణాలు

మహిళా సంఘాల సభ్యులకు రూ.116.74కోట్ల రుణాలను కలెక్టర్ శ్రీహర్ష ఎమ్మెల్యేలతో కలిసి పంపిణీ చేశారు. చైతన్యజ్యోతి మహిళా సమాఖ్య ద్వారా స్వశక్తి మహిళా సంఘాలకు రూ.102,11,50,000, మెప్మా ద్వారా 113 స్వశక్తి సంఘాలకు రూ.14,62,50,000 బ్యాంకు లింకేజీ రుణాలు పంపిణీ చేశారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి హేమంత్ కుమార్, జూనియర్ సివిల్ జడ్జి మంజుల, డీసీపీ చేతన, అదనపు కలెక్టర్లు అరుణశ్రీ, వేణు, ఆర్డీవో గంగయ్య, అధికారులు, పోలీస్, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీపీసీదే ప్రధాన భూమిక

- సీజీఎం చందన్‌కుమార్ సామంత


మాట్లాడుతున్న సీజీఎం

జ్యోతినగర్(రామగుండం): మనదేశాభివృద్ధిలో ఎన్టీపీసీ ప్రధాన భూమిక పోషిస్తోందని రామగుండం–తెలంగాణ ప్రాజెక్టు చీఫ్ జనరల్ మేనేజర్ చందన్‌కుమార్ సామంత అన్నారు. స్థానిక మహాత్మాగాంధీ క్రీడా మైదానంలో జరిగిన గణతంత్ర దినోత్సవంలో ఆయన జాతీయ పతాకం ఆవిష్కరించారు. సీఐఎస్ఎఫ్ సిబ్బంది, విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. తెలంగాణ ప్రాజెక్టు స్టేజీ–2లో భాగంగా ఒక్కోటి 800 మెగావాట్ల సామర్థ్యంగల మూడు మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టును త్వరలో స్థాపిస్తామని వెల్లడించారు. దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు రాఖీ సామంత, ప్రతినిధులు వేముల కృష్ణయ్య, ఆరెపల్లి రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సంక్షేమ ఫలాలు

- రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్


జెండా ఎగుర వేస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: సంక్షేమ ఫలాలు అర్హులైన పేదలకు చేరడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన జాతీయ జెండా ఎగురవేసి మాట్లాడారు. అనంతరం శివాజీనగర్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ఎమ్మెల్యే జాతీయ ఎగురవేశారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మేయర్ బంగి అనిల్‌కుమార్, నాయకులు కాలువ లింగస్వామి, మహంకాళి స్వామి, ఎం.రవికుమార్, కొలిపాక సుజాత, పాతపెల్లి ఎల్లయ్య, ఎండీ ముస్తఫా, బొమ్మక రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.


గోదావరిఖని : సింగరేణి ఆర్జీ-1 ఏరియాలో..


ఆర్జీ-2 ఏరియాలో ఆకట్టుకున్న కళాకారుల నృత్యం


జ్యోతినగర్ : విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

50 శాతం యూరియా తెలంగాణకే..

- ఆర్ఎఫ్‌సీఎల్ సీజీఎం ఉదయ్ రాజహంస


గౌరవ వందనం స్వీకరిస్తున్న ఆర్ఎఫ్‌సీఎల్ సీజీఎం ఉదయ్ రాజసింహ

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): రామగుండం ఫెర్టిలైజర్స్ కెమికల్ లిమిటెడ్ కర్మాగారంలో తయారయ్యే యూరియాలో 50శాతం తెలంగాణ రైతుల అవసరాలకే కేటాయిస్తున్నామని ఆర్ఎఫ్‌సీఎల్ సీజీఎం ఉదయ్ రాజహంస తెలిపారు. కర్మాగారంలో ఆయన త్రివర్ణ పతాకం ఆవిష్కరించి మాట్లాడారు. ఉద్యోగులు భద్రతతో కూడిన ఉత్పత్తి లక్ష్యంగా యాజమాన్యం పనిచేస్తోందని తెలిపారు. అధికారులు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో నడిపించాలి

- నగర మేయర్ అనిల్ కుమార్


జెండా ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ, మేయర్ అనిల్

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని నగర మేయర్ బంగి అనిల్‌కుమార్ కోరారు. బల్దియా కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేసి మాట్లాడారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలు నెరవేర్చేలా దేశాభివృద్ధికి అందరూ పనిచేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ అరుణశ్రీ మాట్లాడుతూ, అధికారులు, సిబ్బంది బాగా పనిచేస్తున్నారన్నారు. కార్పొరేటర్లు కల్వచర్ల కృష్ణవేణి, జనగామ కవితాసరోజిని, నగునూరి సుమలత, ఖాజాసనా, కుమ్మరి శ్రీనివాస్, బాల రాజ్‌కుమార్, అధికారులు రాయలింగు, రామన్, శ్రీధర్‌ప్రసాద్, నవీన్, ఆంజనేయులు, సునీల్ రాథోడ్, కుమారస్వామి, పబ్బాల శ్రీనివాస్, మౌనిక పాల్గొన్నారు.

స్వేచ్ఛతోనే ప్రగతి

- రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్



జాతీయ జెండా ఎగురవేస్తున్న సీపీ శ్రీనివాస్

గోదావరిఖని: మనరాజ్యాంగం స్ఫూర్తితో స్వేచ్ఛ, స్వతంత్రతో మనదేశం ప్రగతిలో ముందుకు సాగుతోందని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. తన కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేసి మాట్లాడారు. సరిహద్దులను కాపాడే సైనికులు, అన్నం పెట్టే రైతులు, సాంకేతికంగా ముందుకు నడిపిస్తున్న శాస్త్రవేత్తలకు మనమందరం కృతజ్ఞతలు చెప్పాలని కోరారు. అనంతరం 2020 సంవత్సరంలో విధుల్లో ప్రతిభ కనబరిచిన ఏసీపీ చిలుకూరి వెంకటేశ్వర్లు, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ ఎల్.లక్ష్మీనారాయణ, కానిస్టేబుల్ రాజేందర్, హోంగార్డులు ఎద్దునూరి రాధాకృష్ణ, ముద్దారపు గిరీశ్‌కుమార్, సప్తపది కిష్టయ్యకు సీపీ పలు పతకాలు అందజేశారు.

ప్రత్యేక రైళ్ల ఆలస్యం.. ప్రయాణికులకు అసౌకర్యం

- అందుబాటులో లేని గదులు – గంటల తరబడి నిరీక్షణ
- రామగుండం రైల్వేస్టేషన్‌లో సేద తీరేందుకు కష్టాలు
- చలిలో వణుకుతూనే ప్లాట్‌ఫారంపై కునుకు తీస్తున్న ప్రయాణికులు
- ఆన్‌లైన్‌లో కనిపించని ప్రత్యేక రైళ్ల స్టేటస్


ప్రత్యేక రైలు కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

రామగుండం: కుంభామేళా సందర్భంగా పుణ్యస్నానాలు చేసేందుకు వెళ్తున్న భక్తుల కోసం రైల్వేశాఖ ప్రత్యేక రైళ్లు నడిపిస్తోంది. ఇవి గంటల తరబడి ఆలస్యంగా నడుస్తుండడంతో భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రైలు నంబరు 07647 సికింద్రాబాద్–ప్రయాగ్‌రాజ్ ప్రత్యేక రైలు శనివారం అర్ధరాత్రి రామగుండం చేరుకోవాల్సి ఉండగా ఆదివారం ఉదయం 7.30గంటలకు వచ్చింది. దీంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి రామగుండం రైల్వేస్టేషన్‌కు వచ్చిన భక్తులు.. గంటల తరబడి నిరీక్షించి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అర్ధరాత్రి రైలు ఉండడంతో స్వస్థలాల నుంచి శనివారం రాత్రి తొమ్మిది గంటల వరకే లగేజీతో రామగుండం రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. ఏడాది నుంచి ప్లాట్‌ఫారం అభివృద్ధి పనులు పనులు కొనసాగుతున్నాయి. అయితే, ప్రయాణికులు సేద తీరేందుకు వసతి గదులు లేవు. దీంతో చలిలోనే గజగజ వణుకుతూ లగేజీతో టికెట్ బుకింగ్ కౌంటర్ ఎదుట కుర్చీల్లో కూర్చొన్నారు. అసౌకర్యంగా ఉన్నా ప్రయాణికులు కునుకు తీస్తున్నారు.

కనిపించని రైలు స్టేటస్..

ప్రయాగ్‌రాజ్ వెళ్లే ప్రత్యేక రైళ్లకు సికింద్రాబాద్ తర్వాత తెలంగాణలో కేవలం రామగుండం రైల్వేస్టేషన్‌లోనే హాల్టింగ్ సౌకర్యం కల్పించారు. దీంతో రాష్ట్ర సరిహద్దులోని గడ్చిరోలి, బస్తర్ తదితర జిల్లా నుంచి కుంభామేళాకు వెళ్లే ప్రత్యేక రైలుకు టికెట్లు బుక్ చేసుకొంటున్న ప్రయాణికులు.. రామగుండం చేరుకుంటున్నారు. రైలు ఎప్పుడు వస్తుందని స్థానిక రైల్వే అధికారులను ప్రయాణికులు సమాచారం అడిగినా స్పష్టత ఇవ్వడంలేదు.

గ్రామసభల ద్వారా అర్హుల ఎంపిక

- అడిషనల్ కలెక్టర్ వేణు


ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న అదనపు కలెక్టర్

పెద్దపల్లిరూరల్: సంక్షేమ పథకాల ఫలాలను అర్హులందరికీ మంజూరు చేస్తామని అడిషనల్ కలెక్టర్ వేణు తెలిపారు. నిమ్మనపల్లి గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభుత్వం గణతంత్ర దినోత్సవం సందర్భంగా అమలులోకి తీసుకొచ్చిన రేషన్‌కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, రైతుభరోసా పథకాలను పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూపతో కలిసి ఆయన ప్రారంభించారు. తొలుత సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని చదివి వినిపించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పథకాల కోసం అర్హులను గ్రామసభల ద్వారా ఎంపిక చేస్తామన్నారు. ప్రాథమికంగా సిద్ధం చేసిన జాబితాపై అభ్యంతరాలు ఉంటే మరోసారి విచారణ జరిపిస్తామని తెలిపారు. రైతులకు ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్, ప్రత్యేకాధికారి అలివేణి, పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

‘భరోసా’ వచ్చింది



కుటుంబ పోషణ కోసం ఉపాధిహామీ పనులకు పోతున్న. ప్రభుత్వం కూలీలకు ఆర్థికంగా అండగా ఉండేందుకు ఆత్మీయభరోసా పథకం అమలు చేస్తున్నది. దీనికింద ఎంపిక కావడంతో భరోసా కలిగించింది.

– ఆకుల సంపత్, ఆత్మీయ భరోసా లబ్ధిదారు

సంతోషంగా ఉంది



ప్రభుత్వం కొత్తగా అమలులోకి తీసుకొచ్చిన రైతుభరోసా పథకం కింద లబ్ధిదారుగా ఎంపిక కావడం సంతోషంగా ఉంది. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నది.

– ఆకుల శ్రీనివాస్, రైతుభరోసా లబ్ధిదారు

నీడ దొరికింది



ఇల్లు కూడా లేని నిరుపేద కుటుంబం మాది. ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకం తెచ్చి నాలాంటి అభాగ్యులకు అండగా నిలిచింది. ఇల్లు నిర్మించుకుని ఇందిరమ్మ ఇంటి నీడన ఉంటాం.

– గట్టమ్మ, ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారు

హర్షణీయం



కొత్త రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకుని ఏళ్లపాటు ఎదురుచూశా. చివరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు కొత్త రేషన్‌కార్డులు ఇవ్వడం హర్షణీయం. రేషన్‌కార్డు రావడం ఆనందంగా ఉంది.

– జస్మిత్‌రెడ్డి, రేషన్‌కార్డుదారు

క్లుప్తంగా

అనారోగ్యంతో అంగన్‌వాడీ టీచర్ మృతి


మరియమ్మ (ఫైల్)

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ మానాల మరియమ్మ (50) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. టీచర్ కుటుంబానికి ఐసీడీఎస్ అధికారులు రూ.20 వేలు, అంగన్‌వాడీ టీచర్లు రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. మరియమ్మ మృతదేహానికి ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, ప్రదానకార్యదర్శి కడారి రాములు నివాళి అర్పించారు. అంగన్‌వాడీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని పేర్కొన్నారు. ఓరుగంటి శ్యామల, పద్మ, సూర్య, చంద్రకళ, వజ్రమ్మ, లక్ష్మీబాయి, వసంత, అరుంధతి, విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో బాలుడు..

మానకొండూర్‌రూరల్: మండలంలోని పచ్చునూర్ గ్రామానికి చెందిన ఓ బాలుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. పచ్చునూర్‌కు చెందిన కనకం వశీకర్ (12) తిమ్మాపూర్ మైనార్టీ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. సంక్రాంతి పండుగ సెలవులకు పచ్చునూర్‌లోని నాన్నమ్మ ఇంటికి వచ్చాడు. శనివారం పచ్చునూర్ నుంచి తన చెల్లెను అమ్మమ్మ గ్రామం కెల్లేడులో వదిలిపెట్టి తిమ్మాపూర్ వెళ్తానని ఇంట్లో చెప్పి వచ్చారు. కెల్లేడులోని ఇంట్లో ఊయలకు ఉన్న చీర మెడకు బిగుసుకుపోయి అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉన్నాడు. బాలుడి తండ్రి విద్యాసాగర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం నిమ్మనపల్లి గ్రామానికి చెందిన వైద తిరుపతి (50) ఆదివారం వేకువజామున ఇంటి ఆవరణలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తిరుపతి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని, బాధ భరించలేక ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని కుటుంబీకులు తెలిపారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు.

వీణవంకలో మహిళ..

వీణవంక(హుజూరాబాద్): మండల కేంద్రానికి చెందిన నీల రమ్య అలియాస్ మరుపాక రమ్య(26) భర్త వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల వివరాలు.. రెండేళ్ల క్రితం రమ్య వీణవంకకు చెందిన నీల సాయికిరణ్‌ను కులాంతర వివాహం చేసుకుంది. భర్త రోజూ మద్యం సేవించి కట్నం తీసుకురావాలని మానసికంగా, శారీరకంగా వేధించడంతో ఆదివారం ఇంట్లో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి మేనమామ కొమ్ము శ్యాం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

ప్రతిభకు పట్టం

- విధి నిర్వహణలో ఉత్తమ సేవలకు గుర్తింపు
- అధికారులు, సిబ్బందికి ప్రశంసలు


కలెక్టర్ కోయ శ్రీహర్ష, పెద్దపల్లి డీసీపీ చేతన నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న రామగుండం హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు అజ్మీరా శారద

పెద్దపల్లిరూరల్: విధి నిర్వహణలో ప్రతిభ చూపిన జిల్లాలోని వివిధ శాఖల అధికారులకు కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రశంసాపత్రాలు అందజేశారు. జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన గణతంత్ర వేడుకల సందర్భంగా ఎమ్మెల్యేలు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, చింతకుంట విజయరమణారావుతో కలిసి ఆయన ప్రశంసాపత్రాలు అందజేశారు. వివిధ విభాగాలకు చెందిన సుమారు 138 మందికి కలెక్టర్ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఇందులో అత్యధికంగా పోలీసు విభాగంలో 20 మంది, ఇంటలిజెన్స్ విభాగానికి చెందిన ఐదుగురు ఉద్యోగులు ఉన్నారు. వారిలో కొందరు ఉద్యోగుల వివరాలు ఇవీ..


శ్రీమాల, జిల్లా సహకార అధికారి
కె.శ్రీధర్, డీపీహెచ్ఎస్
సురేశ్ జిల్లా క్రీడల అధికారి
గజ్జి కృష్ణ, ఏసీపీ పెద్దపల్లి
బి.నరేశ్, అసిస్టెంట్ రిజిస్ట్రార్, (డీసీవో ఆఫీస్)
ఎం.వాసుదేవ్‌రెడ్డి, సర్జన్, పీడియాట్రిక్


అన్నపూర్ణ, హెచ్ఎం జెడ్పీహెచ్ఎస్, గట్టెపల్లి
జ్యోతిర్మయి, ఎంఏవో అగ్రికల్చర్(టెక్నికల్)
జి.అర్చన నేషనల్ ఆర్చరీ
ఎస్.గీతిక, నేషనల్ వాలీబాల్ ప్లేయర్
డి.అరుణ, కోఆర్డినేటర్ మహిళాసాధికారత
ఆర్.రమాదేవి సూపర్‌వైజర్, చైల్డ్‌లైన్
రాజేశ్వరి, లేబర్ మున్సిపల్, పెద్దపల్లి
సబితా తబుస్సుమ్ సర్జన్, ఆప్తాల్మజీ
ఎన్.స్రవంతి సర్జన్, గైనకాలజీ
ఎమాధురి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, సబ్బితం
కె.శ్రీనివాస్‌రెడ్డి సర్జన్, ఆర్థోపెడిక్
విజయ్, డిప్యూటీ తహసీల్దార్, కలెక్టరేట్
ఎన్.మనోహర్ మున్సిపల్ కమిషనర్, మంథని
ప్రతాప్, ఏసీపీ(ఏఆర్) రామగుండం
అనిల్‌కుమార్, కో ఆర్డినేటర్, పోషణ్ అభియాన్
కర్రె ప్రవీణ్, రిసోర్స్ పర్సన్, డీఈవో ఆఫీస్
ప్రకాశ్, సి- సెక్షన్ సూపరింటెండెంట్
బి.రాజం, ఎస్సై ఇంటలిజెన్స్, పెద్దపల్లి
అశోక్‌రెడ్డి, లెక్చరర్, సోషల్ వెల్ఫేర్
నర్సయ్య వ్యాఖ్యాత
బి.రాజం, ఎస్సై ఇంటలిజెన్స్
వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ రిజిస్ట్రార్, డీసీవో ఆఫీస్
ఆర్.స్వామి, సీఐ బసంత్‌నగర్
జె.శ్రీనివాస్‌రావు ఏపీఎం(సెర్ప్)
ఖాజాపాషా సీనియర్ అసిస్టెంట్
అనూష్, రికార్డ్ అసిస్టెంట్, కలెక్టరేట్
సువర్చల, ఏఈవో, సబ్బితం
సంధ్యారాణి, ఎస్సై రామగుండం
సంపత్‌రెడ్డి, రిసోర్స్ పర్సన్, డీఈవో ఆఫీస్
సంపత్‌రావు, వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్, మంథని

నిషేధంపై నిర్లక్ష్యం

- అంజన్న ఆలయంలో యథేచ్ఛగా సెల్‌ఫోన్ల వినియోగం
- మూలవిరాట్ ఫొటోలు, వీడియోలు తీస్తున్న భక్తులు
- పట్టించుకోని ఆలయ అధికారులు


ఆలయంలో ఫొటోలు దిగుతున్న భక్తులు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న ఆలయంలోకి భక్తులు సెల్‌ఫోన్లు తీసుకెళ్లొద్దనే నిబంధనలు ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రధాన ఆలయంలోకి వెళ్లే అర్చకులు, సిబ్బంది ఎవరైనా సరే తమ ఫోన్లను బయటపెట్టి రావాలి. కానీ ఆలయంలో భక్తులతో పాటు అర్చకులు, సిబ్బంది ఇష్టారీతిన మూలవిరాట్ ఫొటోలు, వీడియోలు తీస్తున్నారు.

నిర్లక్ష్యం మెందుకు?

కొండగట్టు ఆలయంలో సెల్‌ఫోన్ నిషేధం ఉన్నట్లు అధికారులు సూచికలు ఏర్పాటు చేశారు. కానీ ఎవరు పడితే వారు మూలవిరాట్ ఫొటోలు, వీడియోలు తీసి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తున్నారు. శాస్త్రం ప్రకారం మూలవిరాట్‌ను స్వయంగా వచ్చి దర్శించుకోవాలి తప్ప ఫొటోలు, వీడియోలు తీయరాదని అర్చకులు చెబుతున్నారు. వేరే ఆలయాల్లో ఎలక్ట్రానిక్ పరికరాలు, ఫోన్లు తీసుకెళ్లకుండా చర్యలు తీసుకుంటున్నారు. కొండగట్టు ఆలయంలో కూడా 2022లో సెల్‌ఫోన్లు భద్రపరిచే టెండర్ పిలిచారు. సదరు టెండర్ పూర్తి కాగా మళ్లీ అధికారులు నిర్వహించలేదు. అప్పటినుంచి ఎవరు పడితే వారు ఆలయంలోకి ఫోన్లు తీసుకెళ్లి ఫొటోలు తీస్తున్నారు. కొన్నిసార్లు ఫొటోలు తీసే క్రమంలో భక్తులకు అధికారులకు గొడవలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా ఆలయ అధికారులు సెల్‌ఫోన్లను ఆలయంలోకి తీసుకెళ్లకుండా కట్టుదిట్టంగా నిషేధం అమలు చేయాలని భక్తులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



నేను ఇటీవలే ఆలయ ఈవోగా బాధ్యతలు తీసుకున్నా. ఫోన్ల కౌంటర్ కోసం టెండర్ ఎందుకు నిర్వహించ లేదో తెలుసుకుంటా. ఆలయంలోకి ఫోన్లు తీసుకెళ్లకుండా చర్యలు చేపడుతాం.

– కృష్ణప్రసాద్, ఈవో, కొండగట్టు

కౌంటర్ ఏర్పాటు చేయాలి



భక్తులు ఆలయంలోకి ఫోన్లు తీసుకెళ్లకుండా అధికారులు సిబ్బందిని నియమించి ఫోన్లు భద్రపరిచేందుకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలి. నిబంధన ఉల్లంఘించిన వారిపై జరిమానా విధించాలి లేదా గతంలో వలె టెండర్ నిర్వహించాలి.

– కొండ మారుతి, భక్తుడు

నిషేధం చేపట్టండి



సామాన్య భక్తులకు ఒక రూల్, వీఐపీలకు ఒక రూల్ ఉండొద్దు. హోంగార్డులు, సెక్యూరిటీ గార్డులు, అధికారులు ఉన్నా ఫోన్‌లు లోపలికి ఎలా వెళ్తున్నాయి. స్వామివారి మూలవిరాట్‌ను ఫొటోలు తీయడం ఎక్కువైంది. ఇప్పటికైనా ఆలయ అధికారులు పకడ్బందీగా సెల్‌ఫోన్ నిషేధం చేపట్టాలి.

– గడ్డం నడిపి మల్లేశం, భక్తుడు, గొల్లపల్లి

ఫొటోలు తీయడం సరికాదు



గర్భాలయంలో ఉన్న మూలవిరాట్‌ను భక్తులు, ఇంకా ఎవరైన సరే స్వయంగా వచ్చి దర్శించుకోవాలి. దీంతో స్వామివారు ఆశీస్సులు ఎల వేళలా ఉంటాయి. ఫోన్లలో ఫొటోలో తీయడం సరికాదు.

– కపిందర్ స్వామి, స్థానాచార్యులు, కొండగట్టు

సారూ.. మా సంగతేమిటి?

- అన్ని అర్హతలు ఉన్నా మాకు ఎందుకు ఇవ్వడంలేదు
- నిమ్మనపల్లిలో అధికారులను నిలదీసిన గ్రామస్తులు


గ్రామసభలో అధికారులను ప్రశ్నిస్తున్న నిమ్మనపల్లివాసులు

పెద్దపల్లిరూరల్: 'మా ఆయన అట్ల అంజయ్య కరోనాతో చనిపోయాడు.. కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న. సర్కారు నుంచి మాకు సాయం ఎందుకు అందివ్వరు..' అని నిమ్మనపల్లి గ్రామానికి చెందిన అట్ల కనకలక్ష్మి అధికారులతో వాదనకు దిగింది. గ్రామానికి చెందిన మరికొందరు కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందేందుకు తాము కూడా అర్హులమేనని, తమకు న్యాయం చేయాలని అధికారులను కోరారు. ప్రభుత్వం ఆదివారం నుంచి అమల్లోకి తీసుకొచ్చిన నాలుగు సంక్షేమ పథకాలను అడిషనల్ కలెక్టర్ వేణు, ఆర్డీవో గంగయ్య తదితరులు నిమ్మనపల్లిలో ఆదివారం ప్రారంభించారు. ఆ తర్వాత అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం గ్రామ ప్రత్యేకాధికారి అలివేణి, పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్‌తోపాటు పలువురు అధికారులు ప్రజలను సముదాయించేందుకు తంటాలు పడ్డారు. జాబితాలో పేరు లేనివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు సూచించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింజేస్తామని హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్తులు శాంతించారు.

అధికార, ప్రతిపక్షాల మధ్య ఘర్షణ

కమాన్‌పూర్(మంథని): రొంపికుంటను నాలుగు పథకాల అమలుకు పైలెట్ ప్రాజెక్టు ఎంపికచేసిన అధికారులు.. ఆదివారం గ్రామసభ నిర్వహించారు. ప్రత్యేకాధికారి ప్రవీణ్‌రెడ్డి అధ్యక్షత వహించారు. రైతుభరోసా మినహా ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డుల మంజూరుకు పది మంది చొప్పున లబ్ధిదారులను ఎంపికచేసి మంజూరుపత్రాలు అందజేశారు. అయితే, ఇటీవల జరిగిన గ్రామసభ సందర్భంగా జాబితాలో ఉన్నలబ్ధిదారుల పేర్లను మళ్లీ చదివి వినిపించాలని బీఆర్ఎస్, బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. దీంతో అధికార, ప్రతిపక్ష నాయకుల మధ్య కొద్దిపాటి ఘర్షణ చోటుచేసుకుంది. అప్రమత్తమైన పోలీసులు ఇరువర్గాలను సముదాయించి అక్కడి నుంచి పంపించివేశారు. దీంతో గ్రామసభ సాఫీగా సాగింది. అనంతరం జాబితాలోని పేర్లను చదివి వినిపించి, వారందరికీ పథకాలను అందించాలని బీఆర్ఎస్ పలువురు నాయకులు మండల ప్రత్యేకాధికారికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లలిత, తహసీల్దార్ వాసంతి, ఏవో రామకృష్ణ, సీఐ ప్రసాదరావు, ఎస్సై ప్రసాద్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


గ్రామస్తులను సముదాయిస్తున్న అధికారులు


రొంపికుంటలో అధికార, ప్రతిపక్ష నేతల ఘర్షణ

రైలులో బిహార్ ప్రయాణికుడి మృతి


సుఖదేవోదాస్ మృతదేహం

రామగుండం: బెంగళూరు నుంచి బిహార్ వెళ్తున్న ఓ ప్రయాణికుడు రైలులో అస్వస్థతకు గురై మృతిచెందిన ఘటన ఆదివారం రామగుండంలో జరిగింది. జీఆర్పీ ఔట్‌పోస్టు ఇన్‌చార్జి తిరుపతి తెలిపిన వివరాలు.. బిహార్ రాష్ట్రం వైశాలి జిల్లాకు చెందిన సుఖదేవోదాస్(65) బెంగళూరులో సఫాయి పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నేపథ్యంలో తన స్వగ్రామానికి వెళ్లేందుకు బెంగళూరులో సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ జనరల్ కోచ్‌లో ఎక్కి ప్రయాణిస్తున్నాడు. మార్గమధ్యలో వేకువజామున అస్వస్థతకు గురవడంతో బోగీలోని ప్రయాణికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. రామగుండం రైల్వేస్టేషన్‌కు రైలు చేరుకోగానే డాక్టర్ పరీక్షించగా అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి వద్ద లభ్యమైన చిరునామా ఆధారంగా కుటుంబసభ్యులకు సమాచారం అందజేసినట్లు జీఆర్పీ తిరుపతి పేర్కొన్నారు.

చికెన్‌తో అధికారుల విందు భోజనం?


విందు భోజనం చేస్తున్న అధికారులు

రుద్రంగి(వేములవాడ): గణతంత్ర దినోత్సవం వేళ రుద్రంగి మండలంలో అధికారుల విందు భోజనంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జాతీయ పండుగలైన స్వాతంత్ర్య, గణతంత్ర, గాంధీ జయంతి రోజుల్లో జీవ హింస చేయరాదని అందరికీ తెలిసిందే. అధికారులు సైతం చికెన్, మటన్ సెంటర్లను మూసి వేయాలని ఆదేశాలు జారీ చేస్తారు. కాగా, ఆదివారం గణతంత్ర దినోత్సవం రోజు రుద్రంగి రైతు వేదికలో కొందరు మండల స్థాయి అధికారులు ఓ మండల అధికారి ఇచ్చిన చికెన్ విందు భోజనానికి హాజరై తృప్తిగా ఆరగించారు. అధికారులే ఇలా చికెన్ విందు భోజనం చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గీతకార్మికుడికి తీవ్రగాయాలు


గాయపడిన మల్లయ్య

జమ్మికుంట(హుజూరాబాద్): ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి జారిపడి గీతకార్మికుడికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్తుల వివరాలు.. మండలంలోని వావిలాల గ్రామానికి చెందిన గీతకార్మికుడు గాజర్ల మల్లయ్య ఆదివారం సాయంత్రం తాటి చెట్టు ఎక్కుతున్న క్రమంలో మోకు జారి కిందపడగా తీవ్రగాయాలయ్యాయి. తోటి గీతకార్మికులు గమనించిన కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

అంతర్జాతీయ పోటీలకు శ్రీజ


శ్రీజను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మనోజ్‌కుమార్

రామడుగు: రామడుగులోని మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న బోగ శ్రీజ అంతర్జాతీయ చిత్రలేఖనం పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మనోజ్‌కుమార్ తెలిపారు. ఆన్‌లైన్‌లో రంగోట్స్ సంస్థవారు నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో జాతీయస్థాయిలో బంగారు పతకం సాధించింది. శ్రీజ వేసిన చిత్రాలు అంతర్జాతీయ పోటీలకు ఎంపిక కావడం జరిగిందన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

పెద్దపల్లిరూరల్: స్థానిక బస్టాండ్ సమీపంలో శనివారం రాత్రి లారీ ఢీకొని గుర్తుతెలియని 60 ఏళ్ల వ్యక్తి మృతిచెందాడు. డ్రైవర్ రాకేశ్ మద్యం మత్తులో నిర్లక్ష్యంగా లారీ నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని నిర్ధారించి అతడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పెద్దపల్లిలోని మార్చురీలో ఉంచినట్లు పేర్కొన్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడికి గాయాలు

మల్యాల(చొప్పదండి): బైక్ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. మల్యాల మండలం రాజారం గ్రామానికి చెందిన బక్కశెట్టి అరవింద్ ఆదివారం రాత్రి మల్యాల నుంచి రాజారం వెళ్తుండగా, స్థానిక బ్లాక్ చౌరస్తా సమీపంలోని విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నాడు. ఈ ఘటనలో విద్యుత్ స్తంభం విరిగిపోగా, అరవింద్ తీవ్రంగా గాయపడ్డాడు. విద్యుత్ అంతరాయం ఏర్పడింది. పోలీసు కానిస్టేబుల్ సురేశ్ ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని 108లో జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కమిషనరేట్‌లో సిటీ పోలీస్ యాక్ట్

గోదావరిఖని: రామగుండం పోలీస్ కమిషన రేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లా ల్లో తొలిసారి ఈనెల 27 నుంచి 31వ తేదీ ఉదయం 6 గంటల వరకు సిటీ పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్నామని సీపీ శ్రీనివాస్ తెలిపారు. 7 (1), 2016, యాక్ట్, 22 (1) (ఏ) నుంచి (ఎఫ్), 22 (2) (ఏ) - (బీ), - 22 (3) సిటీ పోలీస్ యాక్ట్, 1348 నంబర్-9 ఫాస్లి సెక్షన్ 30 పోలీస్ యాక్టు 1861 ప్రకారం సిటీ పోలీస్‌యాక్ట్ అమలులో ఉంటుందన్నారు. ఎన్టీపీసీలో చేపట్టే 800 మెగావాట్ల మూడు విద్యుత్ ప్లాంట్ల కోసం ఈనెల 28న ప్రజాభిప్రాయ సేకరణ ఉందని, ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సిటీ పోలీస్‌యాక్ట్ అమలు చేస్తున్నామని సీపీ వివరించారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఇతర కార్యక్రమాలకు పోలీసుల నుంచి తప్పకుండా అనుమతి తీసుకోవాలని సూచించారు.